ఓం

శ్రీమదాచంటేశ్వరోదాహరణ కావ్యము



మంత్రవాది వీరవెంకట సత్యనారాయణ

శ్రీమదాచంటేశ్వరోదాహరణ కావ్యము

పద్య కవిత్వము

ప్రథమ ముద్రణ : 01.03.2022 వాసరము
భౌమ మహాశివరాత్రి

ప్రతులు : 1000

వెల : రూ॥ 75/-

ముఖచిత్రం : సీతామహాలక్ష్మి శనగల,
హైదరాబాద్


ప్రచురణ : మంత్రవాది

ముద్రణ : శ్రీ లక్ష్మీగణపతి ఆర్ట్ ప్రింటర్స్,
బ్రాడీపేట, గుంటూరు-2.

ప్రతులకు : రచయిత
16-31-63/7, 11వలైను, బాలాజీనగరు,
పాతగుంటూరు, గుంటూరు-522 001
ఆంధ్రప్రదేశ్.
చలభాషి : 81214 99695

విషయసూచిక

విజ్ఞాపన........



సాహిత్య పోషకులకు, కవివరేణ్యులకు, పెద్దలకు, తెలుగు భాషాభిమానులకు నమస్సుమాంజలులతో సమర్పించుకొను విజ్ఞాపనము:

కవి వరేణ్యులు శ్రీ నిడదవోలు వెంకటరావు గారు ది. 27.07.1968 న వ్రాసిన ఉదాహరణ వాఙ్మయ చరిత్ర అను గ్రంథములో ఈ కావ్య లక్షణములను మరియు అనేక ఉదాహరణ కావ్యములను జాగ్రత్తగా పరశీలించి చదివినపుడు వారు విశదపరచిన అనేక విషయములను అవగాహన చేసుకొనియుంటిని. ఎన్నో విషయాలను వారి అవతారిక నందు వెలయించినారు. పద్యకవితలందు కావ్య ప్రబంధశాఖ, శతకశాఖ, ద్విపదశాఖ, యక్షగానములు, ఉదాహరణములు, దండకములు అదే విధముగా పద కవితలలోని గేయకృతులు, సంకీర్తనములలోని సంస్కృతములు, అసంస్కృతములు, వచనకావ్యములు, శాస్త్రీయ గ్రంథములు, వర్థిల్లుచున్న విషయమును తెలియచేసినారు. వారి ఈ పరిశోధక గ్రంథంలో ఉదాహరణ కావ్య సంబంధమైన ఎన్నో విషయాలను సోదాహరణముగా వివరించినారు. ఈ గ్రంథాన్ని బ్ర.శ్రీ. తోపెల్ల బాల సుబ్రహ్మణ్య శర్మ గురువుగారు నాకు సమకూర్చుటచే చదివే భాగ్యము కలిగినది. అనంతరం ఒక చిన్న ఉదాహరణ కావ్యము వ్రాయాలని బలమైన ఆశ కలిగినది. అనంతరం ఈ ఉదాహరణ వాఙ్మయమునకు సంబంధించిన కొందరు పెద్దల పరిశోధనా వ్యాసములను చదివియుంటిని. అందున కవివరులు

శ్రీ జెజ్జాల కృష్ణ మోహనరావు గారు వారి అంతర్జాల బ్లాగునందు ఫిబ్రవరి నెల 2017 వ సంవత్సరము నందు అనేకానేక అంశములతో ఉదాహరణములను పొందుపరిచి చాలా ఆశక్తికరమైన వ్యాసాన్ని ప్రచు రించారు. వారి వ్యాసము ఉదాహరణ కావ్యము వ్రాయాలనుకొనే నాలాంటి వారికి అత్యంత ఉపయుక్తమని చెప్పుటలో నాకు ఏ విధమైన సందేహమూ లేదు. అంత చక్కగా అందరకూ అర్థమగురీతిన వారు ఆ వ్యాసమును ఆవిష్కరించారు. ఈ సందర్భముగా వారికి కృతజ్ఞతలు.

శ్రీనాథుడు రచించిన హర విలాస ఘట్టమునందు ఏడు పద్యములు ఏడు విభక్తులలో వ్రాసినప్పటికీ పంచమీ విభక్తిలో వ్రాయలేదని ఉద్ఘటించారు శ్రీ మోహనరావుగారు పద్యములతో సహ ఉదహరించారు.

తెలుగు సాహిత్య కావ్య ప్రక్రియలలో ఉదాహరణ కావ్యము మిక్కిలి ప్రసిద్ధినొందినట్లుగా ఉదాహరణ వాఙ్మయము మరియూ పరిశోధనా వ్యాసముల ద్వారా తెలియుచున్నది. తెలుగు వ్యాకరణమునందు విభక్తి ప్రత్యయములు మూలాధారములై ఉన్నవి. అటువంటి విభక్తులను ఉపయోగించుచు, ఒక్కో విభక్తి యందు మూడేసి పద్యములను వ్రాసి ముగింపున అన్ని విభక్తులను ఉపయోగించి సార్వవిభక్తికముగా పద్యము వ్రాయవలెను. పిమ్మట కవి అంకితాంకమును శార్దూల విక్రీడితమున కవిపేరు, కావ్య వస్తువులను ప్రకటించుకొనుచూ సమర్పింపవలసి ఉంటుంది.

ప్రతి విభక్తిలోను మొదటి పద్యము తప్పనిసరిగా శార్దూల, మత్తేభ, ఉత్పల, చంపక మాలా వృత్తములలో ఏదో ఒక వృత్తమును ఎంచుకొని

వ్రాయవలెను. రెండవ పద్యము నవవిధ రగడలలో ఏదో ఒకటి ఎంచుకొని వ్రాయవలసి ఉంటుంది. దీనిని కళిక అంటారు. మరియు ఏడవ పద్యము ఉత్కళిక. అంటే కళికలో అర్ధభాగము ఉత్కళిక. ఇలా మొత్తము కూర్చిన పద్య సముదాయమును ఉదాహరణ కావ్యముగా లేదా మరి కొన్ని పద్యములను జోడించి ఉదాహరణ తారావళిగా చెప్పియున్నారు.

నాకు ఒక చిన్న ఉదాహరణ కావ్యము వ్రాయాలని బలమైన ఆశ కలిగినది. నా జన్మ స్థలమైన పశ్చిమగోదావరి జిల్లా ఆచంట గ్రామమున వేంచేసియున్న శ్రీ రామలింగేశ్వర (ఆచంటేశ్వర) స్వామివారిపై ఈ నా శ్రీమదాచంటేశ్వరోదాహరణ కావ్యాన్ని వ్రాయబూనితిని. స్వామి అనుగ్రహము చే తల్లి శారదామాత ఇచ్చిన పదసంపదతో ఈ కావ్యాన్ని వ్రాసితిని.

ఈ కావ్యమును నేను సాహసించి వ్రాయుటకు కారకులూ ఆదర్శ మూర్తులు కవివరేణ్యులు శ్రీ నిడదవోలు వెంకటరావు గారూ, మరియూ శ్రీ జెజ్జాల మోహనరావు గారూ, శ్రీ తోపెల్ల బాలసుబ్రహ్మణ్య శర్మ గురువు గారు మరియూ పెద్దల వ్యాసములు. అందుకు వారందరికీ నమఃపూర్వక కృతజ్ఞతలు.

నేను రచించిన ఈ ఉదాహరణ కావ్యముతో పాటుగా అనుబంధము ఒకటిలో గర్భకవిత్వమునకు సంబంధించిన కొన్ని పద్యములను, అనుబంధం రెండులో చిత్రబంధ కవిత్వమునకు సంబంధించిన కొన్ని పద్యములను, అనుబంధము మూడులోనే సృజించిన నూతన వృత్తములు, ఉపజాతి పద్యములు, అనుబంధము

నాలుగులో శ్రీ రామలింగేశ్వర తగణ దండకము రచించి వినమ్రతతో ఈ గ్రంధాన్ని మీ ముందు ఉంచుచున్నాను. ఆదరింప మనవి. ఎందరో మహానుభావులు... వారందరికీ నా పాదాభి వందనములు.

అదే విధంగా నేను రచించిన ఈ ఉదాహరణ కావ్యమును ఆమూలాగ్రము వీక్షించి ఆశిషములను అంది జేసిన అవధాన తిలక, శ్రీ పుష్పగిరి పీఠ ఆస్థాన పండితులు, బ్రహ్మశ్రీ ముత్యంపేట గౌరీశంకర శర్మ గారికి, అష్టావధాని శ్రీ శైవపీఠ ఆస్థాన పండితులు, శ్రీ పుష్పగిరి పీఠ ఆస్థాన పండితులు, ప్రిన్సిపాల్, సర్దార్ పటేల్ కళాశాల బ్రహ్మశ్రీ డా. ముదిగొండ అమరనాథ శర్మ గారికి, విశ్రాంతాచార్య తెలుగు శాఖ, జవహర్ భారతి, శ్రీమతి డా॥ బి. ఉమాదేవి జంధ్యాల గారికి నా హృదయ పూర్వక కృతజ్ఞతాభి వందనములు సవినయంగా తెలుపుకొనుచున్నాను.

సద్గురువులు, మద్గురువులు చూపిన మార్గములో పయనిస్తూ, అమ్మ శారదాంబ పరిపూర్ణ అనుగ్రహంతో పద్య విద్య నేర్చుకొని ముందుకు నడుస్తున్న నన్ను సదా అక్కున చేర్చుకొని ఆదరిస్తారని ఆశిస్తూ మీ...




బుధజన విధేయుడు

–మంత్రవాది వీరవెంకట సత్యనారాయణ


అంజలింతు



ఉ. కష్టము లోర్చిరే సతము కంటికి రెప్పగ గాచి మా దరిన్
గష్టము జేరనీయకనె కాంతుల బంచిరి జీవితమ్ములన్
విష్టపమందు గూర్చితిరి వెల్గులు జిమ్మెడు సౌధముల్లిటన్
ద్రష్టలు మీరు అంజలిడెదన్ తల నొంచుచు భక్తి తోడుతన్



“సాహితీబంధు”, “ఛందశ్శాస్త్ర రత్నాకర”, “ఛందర్షి”



“అనంతచ్ఛంద” సమూహ వ్యవస్థాపకులు
తోపెల్లబాలసుబ్రహ్మణ్యశర్మ
మాధవ పట్నం
చరభాషి :93466 76049

హితాశంస

నా ప్రియ శిష్యుడు మంత్రవాది సాత్త్వికుడు. మంచి బుద్ధికుశలత కలిగినవాడు. ఏదైనా ఒక విషయమును చెబితే వెంటనే గ్రహించగల శక్తిమంతుడు. గత నాలుగు సంవత్సరములుగా ఇతను నాకు సుపరిచితుడు. నేను గర్వించే శిష్యుడు. పద్యవిద్యలో నావద్ద ఎన్నో నేర్చుకుని ఇవాళ ఒక కవిగా ఎన్నో ప్రక్రియలలో ఆ శారదాంబ దయవలన పద్య రచనను నిర్విఘ్నంగా చేస్తున్నాడు. అ కోవలోనిదే ప్రస్తుత “శ్రీమదాచంటేశ్వ రోదాహరణ” కావ్యము.

ఈ కావ్యమున చాలా చక్కని ధారతో తన రచనా పటిమను ప్రదర్శించా డనుటలో నాకెట్టి సందేహమూ లేదు. ఈ కావ్యములోని అంశాలను ఆద్యోపాంతము పరికించిన పిమ్మట ఒక మంచి ఉదాహరణ కావ్యాన్ని ఇతడు పాఠకులకు అందించాడనేది నాకు కలిగిన అభిప్రాయము. ప్రతి అంశములోనూ తగు జాగ్రత్త వహించి ఈ రచన పూర్తి చేసినాడు. కావ్యారంభమునందు ఉత్పలమాలా ప్రార్ధనా పద్యములు రెంటిని చిత్రబంధ కవిత్వ ప్రక్రియ ననుసరించి ‘చామర’, ‘చతుర్దళ’ బంధములుగా రచించినాడు. క్రితము నితడు ‘శత చిత్రమాలిక’ యను చిత్రబంధ కవిత్వ సంపుటిని వెలువరించినాడు.

మరియొక ముఖ్యాంశము ఇందు కావ్యముతో పాటుగా మూడు అనుబంధములుగా మూడు అంశాలను జత కూర్చినాడు. ఒకటవ అనుబంధమున గర్భ కవిత్వము, రెండవ అనుబంధమున చిత్రబంధ కవిత్వము, మూడవ అనుబంధమున తాను నూతనముగ సృజించిన కొన్ని వృత్తములూ, ఉపజాతి పద్యములూ, చివరగా ఒక చక్కని 'రామలింగేశ్వర తగణ దండకములను రచించినాడు.

ఈ పొత్తము బహుళాదరణము నొందుట ద్వారా నా ప్రియశిష్యుడు మంచి పేరును సముపార్జించాలని మనఃపూర్వకముగా నా ఆశీస్సులను అంద జేయుచున్నాను.

మ॥ దయతోగాచుతనిన్ను బల్కుజెలి మోదంబునన్ విధేయుండవై
నయమారంబుగ గబ్బమల్లు విధి నేర్వన్ నందమొందంగనే
శ్రియమిచ్చున్ శుభ వైభవంబు లిడ దా శీఘ్రమ్ముగన్ నీవు నా
ప్రియ శిష్యుండవు మంత్రవాది ! కొనుమా ! పెక్కొ హితాశంసలున్

– తోపెల్ల బాల సుబ్రహ్మణ్య శర్మ

* * * *

అవధానతిలక

ముత్యంపేట గౌరీశంకర శర్మ

ఆస్థాన పండితులు, శ్రీ పుష్పగిరి పీఠం

నాచారం, హైదరాబాద్.



అభినందన

సహృదయులు "మంత్రవాది" వారికి నమస్కారములు!

మీరు రచించిన వేంకటేశ, నృసింహ, శ్రీమదాచంటేశ్వరోదాహరణ కావ్యమును చూచితిని. చదివి చాలా ఆనందించితిని. ఉదాహరణ ప్రక్రియకు సాహిత్యంలో ఒక ప్రత్యేక స్థానముంది. సప్త విభక్తులతో భగవంతుని అర్చించడం దీంట్లోని అర్థం....అంతరార్థం. ఒక్కొక్క పద్యాన్ని గురించి వివరించాలంటే ఒక పేజీ పడుతుంది. ధారాశుద్ధి రచన, భక్తి యుక్తమైన విభక్తి కావ్య రచన. మనసుకు హత్తుకునే పద సంపద, మళ్ళీమళ్ళీ చదవాలనిపించే దృశ్య పద్య రచన...ఇవన్నీ మంత్రవాది వారి సొత్తు.

మీ రచనలు అందరూ చదివి ఆనందించాలని కోరుతూ, ఇంకా మీ కలం నుంచి ఇలాంటి రచనలు జాలువారి ఆ సరస్వతీ గళసీమ నలంక రించాలని కోరుతూ నమస్సులతో......

3.06.2022

జ్యేష్ఠ శు.చవితి

శుక్రవారము **– ముత్యంపేట గౌరీశంకర శర్మ**

శ్రీరస్తు

నమశ్శివానంద సద్గురవే

డా. ముదిగొండ అమరనాథ శర్మ, అష్టావధాని

ప్రిన్సిపాల్, సర్దార్ పటేల్ కళాశాల
ఆస్థాన పండితులు, శ్రీశైవ మహాపీఠము
ఆస్థాన పండితులు,
జద్గురు శంకరాచార్య మహా సంస్థానం
పుష్పగిరి పీఠము



అన్వీక్షణ

సహృదయులు సాహితీ ప్రియంభావుకలు సన్మిత్రుడు మంత్రవాది వీరవెంకట సత్యనారాయణ రచించిన ఆచంటేశ్వరోదాహరణ కావ్యము ఆద్యోపాంతము అన్వీక్షణ చేశాను. ఇందులోని ప్రతి పద్యమూ హృద్యమే. "కావ్య శాస్త్ర వినోదేన కాలో గచ్ఛతి ధీమతాం" అన్నట్టు మంత్రవాది వారు బాల్యములో అధ్యయనము చేసిన కావ్య శాస్త్ర నైపుణ్యంతో ఒక సుశ్లోకమైన ఉదాహరణ కావ్యం లోకార్పణం చేయడం విశేషం. ఈ శుభ సందర్భంగా మిత్రుడు మంత్రవాది సత్యనారాయణను అభినందిస్తూ....

శ్లో॥ ఉదాహరణ కావ్యస్య కర్తారం కవిశేఖరం ।
సత్యనారాయణం నౌమి సంస్కార గుణ మండితం ॥

– డా. ముదిగొండ అమరనాథ శర్మ

డా. బి. ఉమాదేవి జంధ్యాల
రిటైర్డ్ రీడర్ – తెలుగు శాఖ
జవహర్ భారతి
కావలి



శుభమస్తు...

చిరంజీవి మంత్రవాది వీరవెంకట సత్యనారాయణ వ్రాసిన "శ్రీ మదాచంటేశ్వరోదాహరణ" కావ్యం ఆద్యంతం చదివాను. విభక్తి ప్రత్యయ సమన్వితమైన ఈ కావ్యం చిరంజీవి కలం నుంచి కమనీయంగా రమణీయం గా హృద్యంగా మంచి ధారతో జాలువారింది. తన జన్మస్థలమైన ఆచంట గ్రామములో వెలసిన శ్రీ ఆచంటేశ్వరస్వామి దేదీప్యమానంగా అర్చనా భిషేకములు అందుకొను విధము, ఉత్సవ విశేషములు, కించిత్ స్థల పురాణము వర్ణించడం ముదావహం. ఈ కావ్యం చదివినప్పుడు మనసులో ఆ క్షేత్రాన్ని సందర్శించాలనే కోరిక ప్రతి పాఠకునికీ కలుగుతుందనడంలో ఆశ్చర్యం లేదు. చక్కని పదలాలిత్యంతో చంటీశ్వరుని ఆరాధించిన చి॥ మంత్రవాదికి ఆ పరమేశ్వరుడు ఆయురారోగ్య ఐశ్వర్యాలను ప్రసాదించాలని, మరిన్ని కావ్యములు వ్రాసే శక్తిని, యుక్తిని ప్రసాదించాలని కోరుకుంటున్నాను. ఇందు అనుబంధములుగా విభజించి, గర్భ కవిత్వము, చిత్రబంధ కవిత్వము, తాను సృజించిన నూతన వృత్తములు మరియు ఉపజాతి పద్యములు, శ్రీ రామలింగేశ్వర దండకములను అద్భుతముగా పొందుపరచడం కడుంగడు సంతసము కలిగించింది.

ఈ చిరంజీవి కథలు, వచన, గజల్ మరియూ నానీల సాహిత్య ప్రక్రియలో కూడా అందె వేసిన చెయ్యి. దాదాపు ఐదు వందల నానీలు, వంద గజల్స్ వ్రాసి ముద్రణకు సమాయత్తమౌతున్నాడు. ఒక కథా సంపుటము, పది శతకములు, శతచిత్రమాలిక (బంధ కవిత్వము) లను అచ్చొత్తించినాడు.

శుభమస్తు...

– డా॥ బి. ఉమాదేవి జంధ్యాల



శ్రీమదాచంటేశ్వరోదాహరణ

దేవతా స్తుతి :

ఉ. మ్రొక్కెదఁ బార్వతీ సుతుని, మ్రొక్కెద వాణిని పద్మగర్భునిన్
మ్రొక్కెద నంబుజోదరుని మ్రొక్కెద మాతను భక్తితోడుతన్
మ్రొక్కెద సోమశేఖరుని మ్రొక్కెద గౌరిని, కార్తికేయునిన్
మ్రొక్కెద కోటివేల్పులను మోదముఁ దెల్పుచు నిల్చి మ్రొక్కెదన్

ఉ. శ్రీవరదుం డశేష జన సేమమున్ జూచెడి వాడు శూలికిన్
సేవలన్ బూన్పగన్ భువిని శీఘ్రము సంపదలిచ్చు వానికిన్
త్రోవను జూపి భారమును ద్రుంచు సదాశివ మూర్తికిన్ మదిన్
మేవడితోడ నే నతుల మెండుగ నిచ్చెద చంద్రమౌళికిన్

ఉ. శ్రీరఘు రాము డాశ్రితుల శీఘ్రమున్ బ్రోవఁగ లోక రక్షకుం
డారటఁ దీర్చువా డవని నాపదఁ ద్రోలఁగ జేయ సిద్ధుడై
ధీరుఁడు జేరె భద్రగిరి దీనులఁ గావఁగ ధర్మరూపుడై
కోరిన కోర్కెలన్ సరగుఁ గూర్చెడి వానికి సన్నుతుల్ సదా

చం. వరగుణ ధీరుఁ డార్తజన భారముఁ దీర్చెడివాఁడు సేవకుం
డరయఁగ రామచంద్రునకు, నంబకు ధైర్యము గూర్చినట్టి వా
డిఱుకులఁ ద్రుంచు నేర్పరి గణింప ధరిత్రిని మర్కటేశుఁడే
యరయును నాతఁడే నతుల నర్పణఁ జేసెద నేను భక్తిగన్

ప్రథమా విభక్తి :

ఉ. శ్రీకరు డాపదల్ దొలఁగఁ జేసెడు వాఁడిట దీనబంధువై
మోకరిలంగఁ గోర్కెలను బూన్పు మహాత్ముఁడు కృత్తివాసుఁడే
శోకముఁ దీర్చువాడితఁడు సుందర రూపుఁడు శాంకరీ ధవుం
డాకలి నాశకుం డసుర హారి ప్రభాసిలె చంటి వాసుఁడై 1

కళిక(మధురగతి రగడ) :

సురనుత సౌమ్యుఁడు శోభన రూపుడు
గిరిసుత నాథుడు కేశవ దయితుఁడు
పురజన పూజ్యుఁడు బ్రోచెడు వరదుడు
స్మరహరుఁ డీశుఁడు సంకట హరణుఁడు
పరశివ పౌత్రుఁడు పాతక నాశుఁడు
హరిపద కేశుఁడు హరిధరుఁ డజితుఁడు
దురిత విఘాతుఁడు దుర్జన భంజుఁడు
కరిదృతి ధారుడు కాశిపుర చరుఁడు 2

ఉత్కళిక :

మింటిఁ దాల్చెను చంటిఁ బుట్టెను
వెంట వచ్చెను బంటుఁ గాచెను
పరమ పూజ్యుఁడు వరద హస్తుఁడు
నిరత ధ్యానుఁడు ధరణిఁ దేవుఁడు
వేదవేద్యుఁడు నాద వంద్యుఁడు
మోదమిచ్చెడి ఆదిభిక్షుఁడు
నిరత మాతఁడు నరయు నాథుఁడు
వఱలె బ్రోవఁగ పురము నీశుఁడు 3

ద్వితీయా విభక్తి :

ఉ. దీన జనార్తి నాశకుని, తేజము దీప్తిలఁ గాశివాసినిన్
మానసమందు ధూర్జటిని, మత్తిని గూల్చెడి పార్థివేశునిన్
పీనముఁ బూన్పు శాంకరుని పింగళ నేత్రుని దేవదేవునిన్
వీనులకంటి ధారిఁగని వేడఁగ దీర్చును వేయి కోర్కెలన్ 4

కళిక(తులగవల్గన రగడ) :

చంటినుండి వెలసి తనరు చంటిపుర నివాశి భవుని
కంటఁ జూడఁ జాలు జగతిఁ గంటఁ గాచు గౌరి పతిని
జనుల చింతఁ దీర్చువాని శాంతి సౌఖ్యము లిడు వాని
వినతు లునుచ బ్రోచు వాని పెనుమసనముఁ దిరుఁగు వాని
సానియింటఁ బడిన ద్విజుని సాకి యేలినట్టి వాని
దానవారి మారహరుని వేనవేలఁ బేర్లవాని
శరణమన్నవారి నెపుడు నరయు పరమ వేల్పు శివుని
భరణమొసఁగు వాని గొల్తు రరట మణచు పూజ్య విభుని 5

ఉత్కళిక :

కుత్సితము నణఁచ రథమున
వత్సలుఁడగు భూతపతిని
వత్సరమ్మున కొకపరిని
యుత్సవమునఁ దిరుఁగు హరుని
భక్తి భావముఁగలిపి యను
రక్తిఁ జూపి కొల్తు రతని
శక్తి కొలదిఁ జేయ నుతిని
భక్తజనులఁ గాచు రహిని 6

తృతీయా విభక్తి :

ఉ. ఎవ్వనిచేత నార్యుఁడిట నేలబడంగను మోక్షమొందెనో?
ఎవ్వనిచేత వేశ్యయును నీహము వీఁడుచు స్వామిఁ జేరెనో?
ఎవ్వనిచేత నీపురము నేర్పడి వేగమె వృద్ధి నొందెనో
నవ్వరదుండు చంటిపురి యాత్మభవుండను గొల్తు నే సదా 7

కళిక(ద్విరదగతి రగడ) :

జనియించె నెవరిచేఁ జనువొందె నెవరిచే
జనయిత్రి యాచంట గని కాచె నెవరిచే
వరమాయె నెవరిచేఁ బురమయ్యె నెవరిచేఁ
నురళించె నెవరిచే వరలె నెవ్వారిచే
శుభము లెవ్వారిచే శోభలెవ్వారిచేఁ
బ్రభవించె నెవరిచేఁ బ్రాభవం బెవరిచేఁ
బరవశం బెవరిచే పరమేశుని కృపచే
వరదు డాచంటేశు వరముల మహత్తుచే 8

ఉత్కళిక :

మూలరాట్టునితోడ
శైలపుత్రిక తోడ
శైల జాత్మజుఁ దోడ
గాలి బొట్టియ తోడ
సత్యదేవుని తోడ
నిత్యార్చనలతోడ
నిత్యమయ్యెను వాడ
సత్య వాక్కులతోడ 9

(అథవా)

పర మేశ్వరుని తోడ
పర దేవతల తోడ
వర విఘ్నపతి తోడ
హరిమర్కటుని తోడ
సుర నాయకుల తోడ
పరి వారముల తోడ
సిరి సంపదల తోడ
వర మయ్యె నట వాడ 9

చతుర్థీ విభక్తి :

చం. నిరతముఁ గాచు వానికయి నెమ్మిని గూర్చెడు వానికై సదా
వరములఁబూన్పు వానికయి భారముఁ ద్రుంచెడు వానికై శుభం
కరుఁడు శివాని ఱేనికయి కారుణ పూర్ణ కురంగ పాణికై
సురవర దేవ దేవుకయి స్తోత్రముఁ జేసెదఁ మ్రొక్కి శూలికై 10

కళిక(వృషభగతి రగడ):

నిత్య మంజనము లొన రింతురు నిండు మనమున నగజ పతికై
సత్యరూపముఁ గని భజింతురు శాంతిఁ గూర్చెడు ధరణి పతికై
బిల్వ దళములు సతముఁ బూన్తురు విప్రులట పురశాసనునికై
కల్వపూవులఁ దెచ్చి కొల్తురు కామ్య మొందఁగ మారహరికై
లక్షణమ్ముఁగఁ జేరి నిల్తురు లక్షనామము లర్పణముకై
లక్షపత్రిని పూజ నింతురు రక్షఁ గోరుచు చంద్రధరుకై
పండ్లు పానక ముద్గ పిష్టము పాయసాన్న నివేదనలకై
కండ్లు మూయుచు నర్పణిత్తురు గావు మంచును భూతపతికై 11

ఉత్కళిక :

శివుఁ గయిసేయు శివము కొఱకై
నవ కయిచాపు భవము కొఱకై
వర కయివల్య చరణములకై
పురి కయికూడె హరుని కొఱకై
ప్రవర వృద్ధికి ప్రాపు కొఱకై
భవుని యెంతురు సవతు కొఱకై
కార్తికమ్మున నార్తి హరుకై
వర్తు లిడెదరు భర్త కొఱకై 12

పంచమీ విభక్తి :

ఉ. సారముఁ గూర్చు వారెవరు? సాంబుని కంటెను సాధ్యమేరికిన్
దీరము నెట్లుఁ జేరెదరు? దీనదయాళుని దృక్కు వల్లనే
తీరుఁగ గాఁచు నీశ్వరుని దీక్షను బట్టి భజింపరే! సదా
భారముఁ దీర్చు వారెవరు? భర్గుని కంటెఁ గనంగ గహ్వరిన్ 13

కళిక (హరిణగతి రగడ) :

వఱలె యోగము భర్గుని వలన
పరఁగె సంపద ఫాలుని వలన
గంగ పొంగెను జంగము వలన
చంగ మొందెను శాంతుని వలన
రామ లింగని ప్రేమము వలన
క్షామ మేగెను కాలుని వలన
భక్తి పెరిగెను బాఱుల వలన
ముక్తి కలుగును బూజల వలన 14

ఉత్కళిక :

క్షేమకారిని
రామలింగని
శక్తిఁ గొల్చిన
భుక్తిఁ బూన్చును
భక్తి గల్గును
ముక్తి గల్గును
శంకరు వలన
శాంకరి వలన

15

షష్ఠీ విభక్తి :

ఉ. వత్తురు వీక్షసేయుటకు భర్గుని మా పుర దేవదేవునిన్
జిత్తము నిల్పి కోరెదరు చింతలఁ దీర్పఁగఁ గృత్తివాసునిన్
విత్తముఁ బూన్తు రక్షరుకుఁ బేరిమిఁ గూర్చెడి చంద్రమౌళికిన్
దెత్తురు మ్రొక్కు లీప్సితము దీర్చెడి శూలికి రామలింగకున్ 16

కళిక (ద్విరదగతి రగడ) :

మార్తాండ పురమందు మా లింగ మూర్తికిన్
బార్తెంచి గుడియందు భక్తిగా శూలికిన్
బిల్వ మొక్కటి పూన్చ ప్రియమగున్ భవునకున్
జెల్వరాయఁడుఁ గాన్చి చెలఁగు నీ భక్తికిన్
భక్తి శ్రద్ధలఁ బూజ పరమపావనునికిన్
రక్తినిచ్చు సువీజు రామలింగేశుకున్
మంత్ర మొక్కటి మేలు మంగళము జనులకున్
తంత్రమేటికి? ఏలు ధరనాథు శివునకున్ 17

ఉత్కళిక :

ఆ చంటి సూనునకు
నాచంట వేల్పునకు
మా చంటి దేవునకు
మా కంటి వెల్గునకు
వన్నియ గలవానికి
మన్ననలు బర్గునకు
సన్నుతులు శర్వునకు
సన్నుతులు యేలికకు 18

సప్తమీ విభక్తి :

ఉ. భావన యందు నీవె! మతి భక్తిగఁ గొల్చిన తావునందు నీ
వే! వడియందు వెల్గులను, నేఱుల, దేవళ ప్రాంగణమ్ములన్
జీవమునందుఁ జూచినను చిత్తమునందును నెందుఁ జూఁడ నం
దే వసియించుచుంటివి మహేశ్వర! మానసమందుఁ దల్చెదన్19

కళిక (తురగవల్గన రగడ) :

నమక మందు చమక మందు నాల్గు దిశల ముఖము లందు
గమక మందు లయల యందు కవన మందు శృతుల యందు
పేదవారి హృదయ మందు పేర్మిఁగూర్చు మనుష లందు
వేదమందు నిలిచితి వట వెలసి నావు నాద మందు 20

ఉత్కళిక :

రుదముఁ దీరు పదముఁ బట్టి
హృదయ మందు ముదముఁ గిట్టి
కాలమందు కలిసి యితడు
నేలుచుండు జాల మతఁడు

వేలతళ్కు వెలుగు లతడు
నేలతల్లి నేలు నతఁడు
భువన మందు భవుడు హరుఁడు
భవ భయముల భర్గు డతడు 21

సంబోధన ప్రథమా విభక్తి :

ఉ. సుందర చిన్మ యాన్విత సుశోభిత! సద్గుణ నిర్గుణాత్మ కా
నంద వనాంత రాపగమ నాభిమతా! భువి బాంధవా! శివా
నందము నొందఁగా జనులు, నాస్తికులున్ నుతి యింపరే! మహా
నందిని గాంచి నిన్ సతము నాకముఁ గోరఁగ బ్రోవుమో హరా! 22

కళిక (వృషభగతి రగడ) :

సాని యింటను సౌఖ్య మొందుచు సర్వము మఱచి వర్తిలంగను
దానుఁ జేసిన తప్పు నెంచఁగ సాని చన్నున నిన్ను గనగను
వేన వేలుఁగ నర్చనలనిడి వేదవాక్కుల నిను నుతించిన
వానిని మఱియు సాని నరయఁగ వాసికెక్కితి వో త్రిలోచన!
కాచినవాట! దేవ శుభకర! కామ్యముఁ దీర్చి గ్రామ జనులను
వేచి చూతురు నినుఁ గనుటకై వేయి కన్నుల తోడ నుర్విని
మాస శివరాత్రమున భక్తులు మధుర దినుసుల మంజనములను
ధ్యాస నిల్పుచు నర్పణిత్తురు ధరణినాథా! యాదుకొనగను 23

ఉత్కళిక :

నీవె! తల్లివి నీవె! తండ్రివి
నీవె! గుర్వువు నీవె! దాతవు
నీవె! వెల్గువు నీవె! జ్యోతివి
నీవె! ఆయువు నీవె! వాయువు


నీవె! భూమివి నీవె! అగ్నివి
నీవె! మిన్నువు నీవె గంగవు
నీవె! ధైర్యము నీవె! సర్వము
నీవె! నాథుడ వీవె! యేలుమ 24

సార్వ విభక్తికము :


శా. కద్రూజాంగద! నీవె! యీభువనమున్ గాచంగ శోభింపవే!
భద్రేశా! నిను నేగనంగ మదిలో ప్రహ్లాద మొందన్ సదా
నిద్రాహారములన్ దృజించి కొలువన్ నీకై సతమ్మున్ హరా!
ఛిద్రంబుల్ తొలగింప రావ! ప్రభువై సేమంబుఁ గూర్పంగదే! 25

అంకితాంకము :

శా. గౌరీశా! దమయంతి కృష్ణలు గనన్ గార్వంపు పుత్రుండనై
యారంభించితి నీ యుదాహరణ కావ్యంబున్ ముగింపంగ స్వీ
కారేచ్ఛన్ గొని మత్పరంపర నిటన్ గావంగదే! క్షేమదా!
ఆరామంబున సర్వదా జెలఁగుమా! ఆచంట రామేశ్వరా! 26



ఉత్పలమాల వృత్త చామర బంధం




(ఉదాహరణ కావ్యములోని ప్రార్థనా పద్యమునకు ఈ చిత్రబంధము)

ఉ. మ్రొక్కెదఁ బార్వతీ సుతుని, మ్రొక్కెద వాణిని పద్మగర్భునిన్
మ్రొక్కెద నంబుజోదరుని మ్రొక్కెద మాతను భక్తితోడుతన్
మ్రొక్కెద సోమశేఖరుని మ్రొక్కెద గౌరిని, కార్తికేయునిన్
మ్రొక్కెద కోటివేల్పులను మోదముఁ దెల్పుచు నిల్చి మ్రొక్కెదన్

బంధకీలకం : మ్రొక్కెద(న్) 8 పర్యాయములు ఆవృత్తిగా వచ్చును. చామరము కాడ నుండి 7 భాగములు పఠించి పిదప కాడ వద్ద ఆపవలెను

ఉత్పలమాల వృత్త చతుర్దళ బంధం



(ఉదాహరణ కావ్యము నందలి ప్రార్థనా పద్యమునకు ఈ చిత్రబంధము)

ఉ. శ్రీవరదుం డశేష జన సేమముఁ జూచెడి వాడు శూలికిన్
సేవలఁ బూన్పగన్ భువిని శీఘ్రము సంపదలిచ్చు వానికిన్
ద్రోవను జూపి భారమును ద్రుంచు పురారి పినాకపాణికిన్
మేవడితోడ నే నతుల మెండుగ నిచ్చెద చంద్రమౌళికిన్

బంధ కీలకం :

తూర్పు, దక్షిణ, పశ్చిమ, ఉత్తర దళములు వరుసగా పఠించ వలెను. ప్రతి దళమునకు 'కిన్' 4 పర్యాయములు ఆవృత్తిగా వచ్చును.

అనుబంధము

(గర్భ కవిత్వము)

:: చంద్రశ్రీ వృత్త గర్భిత మేఘ విస్ఫూర్జిత వృత్తము ::

మేఘవిస్ఫూర్జిత వృత్త లక్షణము: యమనసరరగ/యతి–13/సప్రాస
చంద్రశ్రీ వృత్తలక్షణము : యమనసరగ/యతి–12/సప్రాస

మేఘ విస్ఫూర్జిత వృత్తము :

ధరానాథా! రామా! సురవర! సదా తల్చుచుండన్ ✳మనంబున్
వరాలెన్నో కూర్పంగ నరుఁగిడి పాపంబుఁ గూల్చన్ ✳మహాత్మా!
పరేశా! దాక్షిణ్యంబునఁ గనఉగ పాపఘ్ను! రావా? ✳దయాళో!
తరమ్మే! నీరూపంబుఁ గన వరదా! దానవారీ! ✳రమేశా!

చంద్రశ్రీ:

ధరానాథా! రామా! సురవర! సదా తల్చుచుండన్
వరాలెన్నో కూర్పంగ నరుఁగిడి పాపంబుఁ గూల్చన్
పరేశా! దాక్షిణ్యంబునఁ గనఁగ పాపఘ్ను! రావా?
తరమ్మే! నీరూపంబుఁ గన వరదా! దానవారీ!

:: భుజంగ ప్రయాత వృత్త గర్భిత కందవృత్తము ::

భుజంగప్రాయాత **లక్షణము :** 4 యగణములు/ యతి–8/సప్రాస.
భుజంగప్రయాతకు చివర ఒక లఘువు జేరిస్తే కంద వృత్తము అవుతుంది.

కందవృత్త లక్షణము :: ప్రతిపాదంలో మొదట లఘువు గురువు, గురువు లఘువు వేసికుని తర్వాత మూడు తగణాలు వేసికుంటే కంద వృత్తం అవుతుంది. రెండో తగణం మొదటి అక్షరం యతి.

కందవృత్తము :

వరాలమ్మ లక్ష్మమ్మ భాగ్యంబు నీవై✳తి
సురారాధ్య! రావమ్మ! శోభిల్లు శ్రీమా✳త
ధరానాథు దేవేరి! ధామంబుఁ తో రా✳వె
ధరాపుత్రి! మమ్మేలు దాక్షిణ్య రూపా✳న

భుజంగ ప్రయాతము :

వరాలమ్మ లక్ష్మమ్మ భాగ్యంబు నీవై
సురారాధ్య! రావమ్మ! శోభిల్లు శ్రీమా
ధరానాథు దేవేరి! ధామంబుఁ తో రా
ధరాపుత్రి! మమ్మేలు దాక్షిణ్య రూపా!

:: నర్కుట వృత్త గర్భిత చంపకమాలా వృత్తము ::

చంపకమాల లక్షణము: నజభజజజర/యతి-11/సప్రాస.
నర్కుట లక్షణము: నజభజజవ/యతి 11/సప్రాస.

చంపకమాల :

నిరుపమ గాత్రి భారతి! వినీలపు కాంతుల భా✳సిలంగ భా
సురముఁగ భవ్యతేజ మిట శోభిలుచుండఁగ నం✳దమంత నం
బరమును దాఁకె మానసము భాగ్యము నొందెను నీ✳లవేణి! నీ
కరచరణంబు లెల్లపుఁడు గాంచి యజింతును నే✳ను పావకీ!

నర్కుటము :

నిరుపమ గాత్రి భారతి! వినీలపు కాంతుల భా
సురముఁగ భవ్యతేజ మిట శోభిలు చుండఁగ నం
బరము ను దాఁకె మానసము భాగ్యము నొందెను నీ
కరచరణంబు లెల్లపుఁడు గాంచి యజింతును నే

:: అంతరాక్కర గర్భిత త్వరితగతి వృత్తము ::

త్వరితగతి లక్షణము : ననననననగా(గగ)/యతి-11/ సప్రాస.
అంతరాక్కర లక్షణము : సూ-ఇం-ఇం-చం ప్రతి పాదములో ఉంటాయి /సప్రాస/యతి 3 వ గణము యొక్క చివరి అక్షరము.

త్వరితగతి వృత్తము :

వరసుతుఁడ! సుగుణవర! వసుధఁ గనరావా?
సరఁగున నరుఁగిడి సరసముఁగ నిటకున్ వే
పరుఁగులిడుచు జను వర! పరమ నుత! వేగన్
తరమె! నినుఁగనఁగ ధరధవ! కనుల తోడన్

అంతరాక్కర :

వరసుతుఁడ! సుగుణవర! వసుధఁ గనరా
సరఁగున నరుఁగిడి సరసముఁగ నిటకున్
పరుఁగులిడుచు జను వర! పరమ నుత! వే
తరమె! నినుఁగనఁగ ధరధవ! కనుల తో

:: కుసుమవతి వృత్త గర్భిత మందాక్రాంతం ::

మందాక్రాంత లక్షణము : మభనతతగా(గగ)/యతి-11/సప్రాస
కుసుమవతి లక్షణము : మ-భ-న /యతిలేదు / సప్రాస

మందాక్రాంతము :

సావిత్రీ! దేవి! దినమునులి వే సంధ్య కాలమ్ముఁ బ్రోవన్
రావా! నిత్యమ్ము బగితిగలి వేప్రార్థనల్ సల్పుచుండన్
సేవాసక్తిన్ వినతులనులి ప్రాచీదిశన్ జేయుచున్ నిన్
దేవీ! బ్రాహ్మీ! కొలిచెదనులి వేదీ! సవిత్రీ! నమస్సుల్

కుసుమవతి :

సావిత్రీ! దేవి! దినమును

రావా! నిత్యమ్ము బగితిగ

సేవాసక్తిన్ వినతులను

దేవీ! బ్రాహ్మీ! కొలిచెదను

:: అభిఖ్యా, సౌమ్యా గర్భిత మంగళ మహామణి వృత్తము ::

మంగళ మహామణి లక్షణము : స-మ-స-స-స/యతి-9/ సప్రాస సౌమ్యా

అర్ధకలా/మంజుల లక్షణము: స-స-స/సప్రాస/యతిలేదు

అభిఖ్యా/సూచీముఖీ వృత్త లక్షణము : స-మ/సప్రాస/యతిలేదు.

మంగళ మహామణి వృత్తము :

వరదా! శ్రీరామా! ✳ జన బాంధవ! బ్రోవఁగదే!✳

తరమా! గాంచంగన్✳ ఘన తాపసి! శ్రేయముగాన్✳

సరఁగున్ రావేలా?✳ మనసారఁగఁ గొల్చెదలే!✳

పరమాత్మా! శౌరీ!✳ తను భారముఁ దీర్చుమయా!✳

సౌమ్యా/అర్ధకలా/మంజుల వృత్తము :

జన బాంధవ! బ్రోవఁగదే!

ఘన తాపసి! శ్రేయముగాన్

మనసారఁగఁ గొల్చెదలే

తను భారముఁ దీర్చుమయా!

అభిఖ్యా/సూచీముఖీ వృత్తము :

వరదా! శ్రీరామా!

తరమా! గాంచంగన్

సరсగున్ రావేలా?

పరమాత్మా! శౌరీ!

:: విరలోద్ధతా, రాజరాజీ గర్భిత శార్దూల విక్రీడిత వృత్తము ::

శార్దూల విక్రీడిత లక్షణము : మసజసతతగ/ యతి-13/సప్రాస

విరలోద్ధతా లక్షణము : మసజస/యతి-8/సప్రాస

రాజరాజీ వృత్త లక్షణము : తతగ/యతి లేదు/సప్రాస

శార్దూల విక్రీడిత వృత్తము :

రాజీవా! నినుగాంచ రాత్రిс బవలుల్✳ రామా! ప్రకీర్తించెదన్

బూజింతున్ సురవంద్య! బుద్ధి నిడుమా!✳ భూమాత నాథా! సదా

రాజా! శ్రీద! విభో! మురారి కరుణన్✳ రా! మార్గము న్జూపсగా!

నోజంబున్ బ్రసరింపు మోయి! వరదా!✳ ఓమాన్య! సీతాపతీ!

విరలోద్ధతా వృత్తము :

రాజీవా! నినుగాంచ రాత్రిс బవలుల్

బూజింతున్ సురవంద్య! బుద్ధి నిడుమా!

రాజా! శ్రీద! విభో! మురారి కరుణన్

నోజంబున్ బ్రసరింపు మోయి! వరదా!

రాజరాజీ వృత్తము :

రామా! ప్రకీర్తించెదన్

భూమాత నాథా! సదా

రా! మార్గమున్ జూపవే!

ఓమాన్య! సీతాపతీ!

:: విమలా గర్భిత లాలినీ వృత్తము ::

లాలినీ/అక్షరావలీ లక్షణము : రసజగ/యతి–6/సప్రాస

విమలా/కఠోద్గతా లక్షణము : సజగ/సప్రాస/యతిలేదు

లాలినీ/అక్షరావలీ వృత్తము :

చక్కంగన్ ✳ బద ఛాయఁ జేరితిన్

వాక్కాంతా! ✳ పద వైభవాకృతీ!

దిక్కంటిన్ ✳ బద తేనెలుంచితిన్

తక్కొంటిన్ ✳ ముదమున్ దరింపగన్

విమలా/కఠోద్గతా వృత్తము :

పద ఛాయఁ జేరితిన్

బద తేనె లుంచితిన్

బద వైభావాకృతీ!

ముదమున్ దరింపగన్

:: కందగర్భిత జలధరమాలా వృత్తము ::

జలధరమాలా వృత్తము లక్షణము : మభసమ/సప్రాస/యతి-9

జలధరమాలా వృత్తము :

శ్రీరామేశా! సరcగున ✳శ్రీలన్ గూర్పన్
రారా! బ్రోవంగ జనుల రా వైళంబున్
భారంబున్ దీర్పభువిని ✳భక్తిన్ గొల్వన్
గౌరీనాథా! కరుణను కావన్ రావా!

కందము :

శ్రీరామేశా! సరcగున
రారా! బ్రోవంగ జనుల రా వైళంబున్
భారంబున్ దీర్పభువిని
గౌరీనాథా! కరుణను కావన్ రావా!

:: కుసుమవతి వృత్త గర్భిత మందాక్రాంతం ::

మందాక్రాంత లక్షణము : మభనతతగా(గగ)/యతి-11/సప్రాస

కుసుమవతి లక్షణము : మభన/యతిలేదు/సప్రాస

మందాక్రాంతము :

సావిత్రీ! దేవి! దినమును✳ నే సంధ్య కాలమ్ముc బ్రోవన్
రావా! నిత్యమ్ము బగితిగ✳ వేప్రార్థనల్ సల్పుచుండన్
సేవాసక్తిన్ వినతులను✳ ప్రాచీదిశన్ జేయుచున్ నిన్
దేవీ! బ్రాహ్మీ! కొలిచెదను✳ వేదీ! సవిత్రీ! నమస్సుల్

కుసుమవతి :

సావిత్రీ! దేవి! దినమును
రావా! నిత్యమ్ము బగితిగ
సేవాసక్తిన్ వినతులను
దేవీ! బ్రాహ్మీ! కొలిచెదను

:: అభిఖ్యా, సౌమ్యా గర్భిత మంగళ మహామణి వృత్తము ::

మంగళ మహామణి లక్షణము : సమససస/యతి-9/ సప్రాస

అభిఖ్యా/సూచీముఖీ లక్షణము : సమ/సప్రాస/యతిలేదు

సౌమ్యా/అర్ధకలా/మంజుల లక్షణము : ససస/సప్రాస/ యతిలేదు

మంగళ మహామణి వృత్తము :

వరదా! శ్రీరామా!✳ జన బాంధవ! బ్రోవఁగదే!
తరమా! గాంచంగన్ ✳ ఘన తాపసి! శ్రేయముగాన్
సరఁగున్ రావేలా?✳ మనసారఁగఁ గొల్చెదలే!
పరమాత్మా! శౌరీ!✳ తను భారముఁ దీర్పుమయా!

అభిఖ్యా/సూచీముఖీ వృత్తము :

వరదా! శ్రీరామా!
తరమా! గాంచంగన్
సరఁగున్ రావేలా?
పరమాత్మా! శౌరీ!

సౌమ్యా/అర్థకలా/మంజుల వృత్తము :

జన బాంధవ! బ్రోవఁగదే!

ఘన తాపసి! శ్రేయముగాన్

మనసారఁగఁ గొల్చెదలే

తను భారముఁ దీర్చుమయా!

:: విరలోద్ధతా, రాజరాజీ గర్భిత శార్దూలవిక్రీడిత వృత్తము ::

శార్దూలవిక్రీడిత వృత్త లక్షణము : మసజసతతగ/యతి-13/సప్రాస

విరలోద్ధతా వృత్త లక్షణము : మసజస/యతి-8/సప్రాస

రాజరాజీ వృత్త లక్షణము : తతగ/యతి లేదు/సప్రాస

శార్దూలవిక్రీడితము :

రాజీవా! నినుగాంచ రాత్రిఁ బవలుల్ ✳రామా! ప్రకీర్తించెదన్

బూజింతున్ సురవంద్య! బుద్ధి నిడుమా! ✳భూమాతనాథా! సదా

రాజా! శ్రీద! విభో! మురారి కరుణన్ రా! ✳మార్గము న్జూపఁగా!

నోజంబున్ బ్రసరింపుమయ్య! వరదా! ✳ఓమాన్య! సీతాపతీ!

విరలోద్ధతా వృత్తము :

రాజీవా! నినుగాంచ రాత్రిఁ బవలుల్

బూజింతున్ సురవంద్య! బుద్ధి నిడుమా!

రాజా! శ్రీద! విభో! మురారి దయతో

నోజంబున్ బ్రసరింపుమయ్య! వరదా!

రాజరాజీ వృత్తము :

రామా! ప్రకీర్తించెదన్

భూమాత నాథా! సదా

రా! మార్గమున్ జూపవే!

ఓమాన్య! సీతాపతీ!

:: పద్మనాభ వృత్త గర్భిత విజయ భద్రరగడ ::

విజయ భద్రరగడ లక్షణము :

జాతి రగడ. 24 నుండి 40 అక్షరములు ఉండును. 2 పాదములు ఉండును. సప్రాస/అంత్య ప్రాస, ప్రాస యతి నియమం కలదు. ప్రతి పాదము నందు 5వ గణము యొక్క మొదటి అక్షరము యతి ప్రతి పాదము నందు ఎనిమిది 5 మాత్రలు గణములుండును.

పద్మనాభ వృత్త లక్షణము : తతతతతతతగా(గగ)/సప్రాస/యతి-13

విజయ భద్రరగడ :

రామేశపుత్రుండ! విఘ్నాంతకా!నీవె! రక్షింప వేగంగ విఘ్నేశ! రావే✳ల
నీమాలతో నిన్నుకీర్తించి మ్రొక్కంగ నేనుంటి నంచున్నదా బ్రోవ రావే✳ ల
మామాటల న్వేదవాక్కుల్గ భావించి మామంచి దేవుండ వీవంచు నెంచం✳గ
రా! మాకు నీవే కదా దైవమున్ దోడు రక్షింప వేరెవ్వరున్ లేరు కావం✳గ

పద్మనాభ వృత్తము :

రామేశ పుత్రుండ! విఘ్నాంతకా! నీవె! రక్షింప వేగంగ విఘ్నేశ! రావే

నీమాలతో నిన్నుకీర్తించి మ్రొక్కంగ నేనుంటి నంచున్నదా బ్రోవ రావే

మామాటల న్వేదవాక్కుల్గ భావించి మామంచి దేవుండ వీవంచు నెంచన్

రా! మాకు నీవే కదా దైవమున్ దోడు రక్షింప వేరెవ్వరున్ లేరు కావన్

:: నాగర గర్భిత ఉత్పలమాల ::

ఉత్పలమాల లక్షణములు : భరనభభరవ/సప్రాస/యతి-10

నాగర లక్షణములు : భరవ/సప్రాస/యతి లేదు

ఉత్పలమాల :

శారద! ప్రోవుమా! కవన సారము, *గూర్పుమ! తెన్గుసంపదన్
సారస దీప్తిఁ బోలగను సొంతము *నేర్పుమ! పద్య పాఠముల్
భారతి దీవెన లిడుచుఁ బల్విధి *నేర్పడ సాహితీ సుధల్
ధారణ శక్తి నీయగదె! దండల *నర్పణఁ జేసెదన్ సదా!

నాగర :

కూర్పుమ! తెన్గుసంపదన్
నేర్పుమ! పద్య పాఠముల్
యేర్పడ సాహితీ సుధల్
నర్పణఁ జేసెదన్ సదా!

:: సుగంధి గర్భిత చంచల ::

చంచల లక్షణములు : రజరజరల/సప్రాస/యతి-9

సుగంధి లక్షణములు : రజరజర/సప్రాస/యతి-9

చంచల :

కావవే యటంచు నిన్నుఁ గాంచి, మ్రొక్కి నిల్చితే*ను
శ్రీవరాహ నారసింహ! చేకొనంగఁ బ్రోవరా*వ
నీవె! దిక్కు దేవ నాకు నిన్ను నమ్మి యుంటినే*ను
దేవరా! కనంగ వేగ దేవితోడఁ జూడవే*ల

సుగంధి/ఉత్సాహ :

కావవే యటంచు నిన్నుఁ గాంచి, మ్రొక్కి నిల్చితే
శ్రీవరాహ నారసింహ! చేకొనంగఁ బ్రోవరా
నీవె! దిక్కు దేవ నాకు నిన్ను నమ్మి యుంటినే
దేవరా! కనంగ వేగ దేవితోడఁ జూడవే

:: సుకేసర గర్భిత చంపకమాల ::

చంపకమాల లక్షణములు : నజభజజజర/సప్రాస/యతి-11

సుకేసర లక్షణములు : నజభజర/సప్రాస/యతి-11

చంపకమాల :

పరిపరి రీతులన్ గనఁ గపా✳ ✳సతమ్ము జగమ్ము ✳నేలగన్
స్థిరముగ సంపదల్ నిడి వసింపఁ ✳గఁ జేయు వరాల✳ జేజిగా
నరయును జాగు సేయక జయంతు ✳పురారి హరుండు✳ బ్రోవగన్
పరిహసనమ్ము వీడుచు శివాని ✳తపించి నుతించి✳ మ్రొక్కరే!

సుకేసర :

పరిపరి రీతులన్ గనఁ గపా✳ నేలగన్
స్థిరముగ సంపదల్ నిడి వసింపఁ జేజిగా
నరయును జాగు సేయక జయంతు బ్రోవగన్
పరిహసనమ్ము వీడుచు శివాని మ్రొక్కరే!

:: కమలవిలసిత గర్భిత త్వరితగతి/పాలాశదళ వృత్తము ::

త్వరితగతి/పాలాశదళ లక్షణములు :

నననననగా(గగ)/స(ప్రాస/యతి–11

కమలవిలసిత లక్షణములు : నననగా(గగ)/స(ప్రాస/యతి–9

త్వరితగతి/పాలాశధళము :

తలచి ✳నిరతమును వివిధ నియతుల భాసం✳
బలరు ✳హరిని పిలిచి యిహ మరయఁగఁ గోరన్✳
వెలుగుఁ ✳గరివరదుడు భువికరుగిడి (ప్రోచున్✳
కలికి ✳సిరిధవుఁడిట మగసిరి గలవాడై✳

కమలవిలసితము :

✳నిరతమును వివిధ నియతుల భాసం✳
✳హరిని పిలిచి యిహ మరయఁగఁ గోరన్✳
✳గరివరదుడు భువికరుగిడి (ప్రోచున్✳
✳సిరిధవుఁడిట మగసిరి గలవాడై✳

:: భుజంగ శిశురుత గర్భిత త్వరితపదగతి వృత్తము ::

త్వరితపదగతి లక్షణములు : నననననయ/స(ప్రాస/యతి 11

భుజంగ శిశురుత లక్షణములు : ననయ/స(ప్రాస/యతి లేదు

త్వరిత పద గతి :

పరము నిహముఁ దెలిపి ✳భువన ధవుఁడు సతమ్మున్✳
వరదుఁడతఁడు కరికి ✳జవము నొసఁగినవాడే✳
పరమునకు గమనము ✳టవము దెలిపెడు వాడే✳
వరముల నిడి జనుల ✳భవముఁ దొలఁగఁగఁ జేయున్✳

భుజంగ శిశురుతము :

✳భువన ధవుఁడు సతమ్మున్✳

✳జవము నొసఁగిన వాడే✳

✳టవము దెలిపెడు వాడే✳

✳భవముఁ దొలఁగఁగఁ జేయున్✳

:: విశ్వముఖీ గర్భిత అశ్వగతి వృత్తము ::

అశ్వగతి లక్షణములు : భభభభభగ/సప్రాస/యతి-10

విశ్వముఖి లక్షణములు : భభభగ/సప్రాస/యతి-7

అల్పాక్కర లక్షణములు : ప్రతి పాదమునందు రెండు ఇంద్ర, ఒక చంద్ర గణములుండును ప్రతి పాదమునందు 3వ గణము యొక్క మొదటి అక్షరము యతి/సప్రాస

అశ్వగతి :

ధీరుఁడు రాముఁడు ✳ధాత్రిని దీనజనార్తిని దీర్చెను దా✳

మారుతి సేవలఁ ✳బొందెను మానవ రూపుఁడు మాధవుడై✳

కారణ జన్ముని వేణువు ✳గాన మడంచును కష్టములన్✳

గోరఁగఁ దీర్చును గోర్కెలఁ ✳గూనల నిచ్చును గుస్తుభుడే!✳

విశ్వముఖి :

✳దీనజనార్తిని దీర్చెను దా✳

✳మానవ రూపుఁడు మాధవుడై✳

✳గాన మడంచును కష్టములన్✳

✳గూనల నిచ్చును గుస్తుభుడే!✳

అల్పాక్కర :

✳దీనజనార్తిని దీర్చెను దా✳

✳మానవ రూపుఁడు మాధవుడై✳

✳గాన మడంచును కష్టములన్✳

✳గూనల నిచ్చును గుస్తుభుడే!✳

:: మణిగణ నికర గర్భిత కనకలత వృత్తము ::

కనకలత లక్షణములు : ననననననస/సప్రాస/యతి-13

మణిగణ నికర లక్షణములు : నననస/సప్రాస/యతి-9

కనకలత :

ఇరవుఁగ తిరు ✳హరికి నతుల నిడ ననయ మరయు నా✳
వరదుడుఁ గని ✳కరుణఁ గరిని వడిఁ గనఉగ సరగునన్✳
దిరిగి పొలయు ✳యరిని విడఁగఁ దెగువడఁగె మకరికిన్✳
సిరిధవునకు ✳ధరణి నుతుడు జిత ధరునకు ప్రణతుల్✳

మణిగణనికరము :

✳హరికి నతుల నిడ ననయ మరయు నా✳
✳కరుణఁ గరిని వడిఁ గనఁగ సరగునన్✳
✳యరిని విడఁగ దెగువఁడఁగె మకరికిన్✳
✳ధరణి నుతుడు జితధరునకు ప్రణతుల్✳

:: ఉత్సుక గర్భిత భూతిలకము ::

భూతిలక లక్షణములు : భభరసజజగ/సప్రాస/యతి-12

ఉత్సుక లక్షణములు : భభర/సప్రాస/యతి లేదు

భూతిలకము :

✳శ్రీకర! వేడెద నిత్యమున్✳ దరిఁ జేరి సాగిలి మ్రొక్కగన్
✳వేకువ ఝామున భక్తిగన్✳ పదివేల జోతల నీయగన్
✳నీకు దయామయ! కావవే!✳ హరి! నీపదమ్ముల నంటగన్
✳వీకొని పోవుట ధర్మమా!✳ కరివేల్పు! ప్రోవుమ! వేగమే


ఉత్సుక :

✳శ్రీకర! వేడెద నిత్యమున్✳
✳వేకువ ఝామున భక్తిగన్✳
✳నీకు దయామయ! కావవే!✳
✳వీకొని పోవుట ధర్మమా!✳

అనుబంధము-2

(చిత్రబంధ కవిత్వము)

తేటగీతి డమరుక బంధము




తే.గీ. శ్రీల నిచ్చెడివాఁడట శ్రీశుడిలను
శ్రీపతి యనుచుఁ గొల్వరె! శ్రీలకొఱకు
శ్రీవనేశుని వేడఁగ శ్రీశ యంచు
శ్రీహరియె కూర్చు ధాత్రిని శ్రీల సతము

బంధకీలకం :

'శ్రీ' 8 పర్యాయములు ఆవృత్తిగా వచ్చును. డమరుకము నందు శ్రీ తో ఆరంభించి కుడి వైపుకు, ఎడమ వైపుకు అలా నాలుగు భాగములు చదువ వలెను.

తేటగీతి షట్పది షట్దళ బంధము



తేటగీతి షట్పది :

హరిని శరణంచు బూజించు కరము కరము

శౌరి ప్రోచును జెప్పరె! శరణు శరణు

చక్రి నామమె కలియందు జపము జపము


సాధనమ్మును జేయుమ! సతము సతము

ధరుని దర్శన భాగ్యమె వరము వరము

విదిత మిద్దియె జనులార! వినుమ! వినుమ!

బంధ కీలకం : 1 నుంచి 6 వరకు 6 దళముల లోని పాదములు పఠించవలెను. (పటము నందు సంఖ్యల ప్రకారము)


కంద సూర్య రథబంధము



కం. రామా! ప్రోవఁగ రా! వర!
రామా! రారా! రయమున రంజిల్లంగన్
శ్రీమాధవ మ్రొక్కఁగ నే
రామా! రామా! యనె మది రహి నీరావే

బంధ కీలకం : రథము నందు పై భాగము నుండి వరుసగా ఎడమ వైపు నుండి కుడి వైపునకు క్రింది వరకూ పఠించ వలెను. **'రా ప్రోవర! శ్రీ రామ! నీవే!'** వాక్య గర్భితము.

కంద కిరీట బంధము




కం. శ్రీ శంకరుడే హరుడట
నీశుం గడు భక్తిఁ గొలువ నిల హరు గనుచున్
క్లేశములను రిపుహరి గొను
నా శివుడే ప్రోచి యేరు నా దానవులన్

బంధ కీలకం :

కిరీటము పైనుంచి క్రింది వరకూ ఎడమ నుండి కుడి వైపునకు పఠించ వలెను. **'శ్రీ కరుడు హరియే'** అను వాక్య గర్భితము.

భుజంగ ప్రయాత చక్రాయుధ బంధము



భుజంగప్రయాతము : యయయయ/సప్రాస/యతి–8

భు.ప్ర. ప్రభా దివ్య దేవా! శుభానందభావా!


ప్రభా తేజ భావా! శుభంబీవె కావా?

విభో! కావరావా? సువీజా! సుభావా!

శుభాలీయ రావా? సుశోభా! ప్రభావా!

బంధ కీలకం : 'వా' అను అక్షరము 8 పర్యాయములు ఆవృత్తిగా వచ్చును. గడియారము తిరుగు విధముగా 1 నుండి 8 వరకూ పఠించ వలెను.

కంద ముక్తాహార బంధము



కం. మురహరి కిడు సేవనముల్


నరులకు నొసఁగును శుభములు నవజీవనముల్

హరి పదములు పావనముల్

సరఁగున నతిడ బెరయరె! సుచల శ్రీవనముల్

బంధ కీలకం : 'వనముల్' 4 పర్యాయములు ఆవృత్తిగా వచ్చును. హారము లోని ఎడమ ప్రక్క చిన్న భాగము, పెద్ద భాగము తదుపరి కుడి ప్రక్క చిన్న మరియూ పెద్ద భాగములు వరుసగా 'వనముల్' తో కలిపి పఠించ వలెను.


ఉత్పలమాలా వృత్త డిండిమ బంధము



ఉ. శ్రీకర! శ్రీల నీయగను శ్రీనిధివై రఘురామ! ప్రోవగన్
మా కిల తోడువై నిలచి మా వెతఁ దీర్పఁగ వేల్పువైతివే!
వేకువ తోడుతన్ దమము వీడఁగ నత్తరి సన్నుతింతు నే
తీకులబెట్టు బాధలను దీర్పుమ! శీఘ్రము మాధవా! హరీ!

బంధ కీలకం : డిండిమము పైనుంచి క్రిందికి 13 భాగములు ఎడమ నుంచి కుడివైపునకు వరుసగా పఠించ వలెను. **'శ్రీశ్రీశ్రీ శ్రీరామా మా వేదన దీర్పుమా హరీ!'** అను వాక్య గర్భితము.

కంధ పుష్ప బంధము



కం. మ్రొక్కుడు శారద మాతను
మ్రొక్కుడు భారతిని వేడ మోదము తోడన్
మ్రొక్కుడు చదువుల తల్లిని
మ్రొక్కుడు పదివేల నతుల మ్రోలను జేరన్

బంధ కీలకం : 'మ్రొక్కుడు' 4 పర్యాయములు ఆవృత్తిగా వచ్చును. కాడ నుండి ఎడమ దళము, ఎడమ మధ్య దళము వరకు తదుపరి కుడి దళముల, కుడి మధ్య దళములను పఠించ వలెను.

అశ్వగతి వృత్త చతురంగ బంధము


ధీ 1	ము 30	ని 9	సే 20	డు 3	దె 24	ర్చు 11	మా 26
దా 16	తి 19	రు 2	రా 29	దీ 10	ర 27	రా 4	బొం 23
ని 31	త్రి 8	మా 17	ర్తి 14	వ 21	డు 6	ను 25	చు 12
రు 18	ని 15	గన్ 32	ధా 7	ఘు 28	నా 13	ల 22	ము 5
గా 33	ర్చు 62	పు 41	ని 52	ణ 35	న 56	న 43	గో 58
తన్ 48	గ 51	ర 34	దీ 61	గా 42	ర్కె 59	జ 36	గూ 55
ని 63	శ 40	గో 49	చు 46	చ్చు 53	ని 38	ల 57	మ 44
ర 50	వె 47	లన్ 64	వం 39	ల 60	డం 45	ను 54	న్మ 37

అశ్వగతి లక్షణములు : భభభభభగ/సప్రాస/యతి–10

అశ్వగతి : ధీరుఁడు రాముఁడు ధాత్రిని దీర్చుచు నార్తిని దా
మారుతి సేవలఁ బొందెను మా రఘురామునిగన్
గారణ జన్మని వంశపు గానమడంచు వెతన్
గోరఁగఁ నిచ్చును గూనల గోర్కెలఁ దీర్చునిలన్

బంధ కీలకం : చతురంగ క్రీడ యందు అశ్వము ఏ విధముగా పయనించునో అదే విధముగా అక్షరములు పఠించి వలెను. (గడుల యందు 1 నుండి 64 వరకూ సంఖ్యలు సూచింప బడినవి)

కింద లిఖిత పత్ర సంపుటి బంధము



కం. మ్రొక్కగ శారద మాతను


మ్రొక్కగ పదములను విరుల మోదము తోడన్

మ్రొక్కగ శిరమును వంచుచు

మ్రొక్కగ పదివేల నుతుల మోహము తొలగున్

బంధ కీలకం : కింద లిఖిత పత్ర సంపుటి బంధము “మ్రొక్కగ” 4 అవృత్తములుగా వచ్చును. మొదట ఎడమ ప్రక్క, తరువాత కుడి ప్రక్క బాణము గుర్తు ప్రకారము పఠించవలెను.

సౌరబంధము



కం. సూర్యుడె జగతికి మూలము


సూర్యుడె కాంతులను గూర్చి శోభల నిచ్చున్

సూర్యుడె మూలాధారము

సూర్యుడె లేకున్న సృష్టి శూన్యము కాదే!

బంధ కీలకం : "సూర్యుడె" 4 అవృత్తములుగా వచ్చును. 1,2,3,4 సంఖ్యలు ననుసరించి కుడి నుండి ఎడమ వైపుకు పఠింపవలెను.

వ్యోమ బంధము



శా. రావాదేవ! మొరాలకింప వరదా! రావేల? హే శంకరా!
నీవే నన్నిట బ్రోచువాడవు కదా! నిక్కంబు జెప్పంగ నీ
సేవాతత్పరుడన్ దళంబులను నే జేకూర్చి పూజింతు సే
వా వేంచేపుల గైకొనంగ ధృతితో బాటున్ హరింపన్ శివా!

బంధ కీలకం : 1,2,3,4 పాదములు సంఖ్యలు. 1, 2 పాదములు వృత్తము లోని మొదటి రెండు వరుసలలో, 3,4 పాదములు మొదటి వృత్తములోని 3, 4 వరుసలలో వచ్చును. ప్రతి పాదమునందు ఆద్యంతాక్షరాలు ఒకటే రావలెను.

అనుబంధము - 3

(నే సృజించిన నూతన వృత్తములు,
ఉపజాతి పద్యములు)

1. భారవి యను క్రొత్త ఛందము :

ఈ వృత్తము నాచే సృజింప బడినది.

భారవి లక్షణములు : ఇది కృతి ఛంద వృత్తము.

వృత్తసంఖ్య : 353687. భరభరభరవ/సప్రాస/యతి–13

భారవి :

భారతి! నీపదం బంటుచు మ్రొక్కెదన్ భారముఁ దీర్పగన్ సదా
చారముఁ దెల్పుమా! పద్యము వ్రాయగన్ సర్వము నేర్వ కావ్య సా
కారము నెవ్విధిన్ పొందెద? బ్రోవుమా! కార్యముఁ బూన్పుమా! మదిన్
గోరిన శీఘ్రమే తీర్చెద వీవిలన్ కూరిమి తోడ శారదా!

2. మరో క్రొత్త ఛందము(అతిధృతి) భారతి :

ఈ వృత్తము నాచే సృజింప బడినది.

భారతి వృత్త లక్షణములు : అతిధృతి ఛందములో

వృత్తసంఖ్య–157343 భసరసభతగ/సప్రాస/యతి–12

భారతి :

భారతి పద సేవానురక్తిని భారంబని యోచింపకే
ధీరము మనకేరీతిఁ గల్గును? దేవీ! శరణమ్మంచు, హం
కారములను వీడంగ పద్యపు కావ్యమ్ములఁ బూజించుచున్
దీరుగ నతులన్ బూన్పరే! ఘన దృక్కుల్ కడలొత్తంగవో!

3. మరో క్రొత్త ఛందము: స్వర్ణమాలా వృత్తము :

స్వర్ణమాలా వృత్త పద్య లక్షణములు : కృతి ఛందమునకు చెందిన 388976 వ వృత్తము. నజజనభసవ(లగ)/సప్రాస/యతి–10

స్వర్ణమాలా వృత్తము :

వరముల నిచ్చి సతమ్ము వసుధ గాజును సరగున్ మదిన్
హరిని మురారిని గొల్వ నరుగు దెంచరె! గిరికిన్ భువిన్
వరలును ధర్మము శాంతి వరలు సేమము బలు శ్రీలు శ్రీ
కరుని నుతింపగ నంత కలుగు నాకము విదితంబిదే!

5. మరో క్రొత్త ఛందము: రసమయి వృత్తము :

రసమయి వృత్త పద్య లక్షణములు : అతిధృతి ఛందమునకు చెందిన 221723 వ వృత్తము. ప్రతి పాదమునందు రసమయభభగ/ సప్రాస/ యతి–10

రసమయి వృత్తము :

భారతీ! ధవళాంగీ! దేవీ! పదంబున్ మేవడి నేర్పగదే!
శారదా! కవనంబున్ వ్రాయన్ జవంబున్ బూన్పుమ! శీఘ్రము వే
దౌరులన్ గురిపింపన్ నాపై, ధరింపం జేయుమ! పల్కుజెలీ!
చేరితిన్ భవ సాన్నిధ్యంబున్ శివం బీవే యని వేదమయీ!

6. మరో క్రొత్త ఛందము : సత్యప్రియ వృత్తము :

సత్యప్రియ వృత్త పద్య లక్షణములు : ప్రకృతి ఛందమునకు చెందిన 517812 వ వృత్తము. సభరసభనయ/యతి13/సప్రాస

సత్యప్రియ వృత్తము :

వరమే! నీ మధురంపు గీతము నే బల్కగ నవనిని శ్రీశా!
తరమే! నాకిట నీదు రూప మిలన్ దర్శన ముపగతి నొందన్
హరి! నీ సన్నిధి నాకమే కద! ఈహమ్ములు విడిచి తరింతున్
వరదా! వీడకు మెప్పుడున్ గనుమా! భారము లడచి ముకుందా!

మరో క్రొత్త ఛందము : 7. కృష్ణప్రియ వృత్తము :

కృష్ణప్రియ వృత్త పద్య లక్షణములు : కృతి ఛందమునకు చెందిన 359703 వ వృత్తము. భరతభనరవ(లగ)/యతి10/సప్రాస

కృష్ణప్రియ వృత్తము :

నీలగళా! భవా! ఓంకార! నెమ్మిని సతము గూర్పగన్ సదా
వేలుగ జోత లర్పింపంగ వేగ మరుగిడి కావ రాగదే!
శూలి తరింతునయ్యా! నేను చోక్షము గలుగ శంకరా! హరా!
ఏలిక వైతివయ్యా! దేవ! ఏలగ సరగు బ్రోవమయ్యరో!

మరో క్రొత్త ఛందము: 8. వంశీ వృత్తము :

వంశీ వృత్త పద్య లక్షణములు : వృత్తం రకానికి చెందినది. ప్రకృతి ఛందమునకు చెందిన 714431 వ వృత్తము. భనరసభజర/యతి13/ సప్రాస

వంశీ వృత్తము :

తీరుగ జనులు సన్నుతింపగనే దేవర మురారి వేగమే
భారము నడిచి ప్రోచు వాడతడే! భక్తిగ భజింపరే హరిన్
భూరి వరదుడు పాపనాశకుడున్ భోగముల నిచ్చు నాతనిన్
వారిజ నయను డా గదాగ్రజునిన్ వాసిగ యజింపరే సదా

మరో క్రొత్త ఛందము : 9. దమయంతి :

దమయంతి పద్య లక్షణములు : కృతి ఛందమునకు చెందిన 453335 వ వృత్తము. భరసజభజవ /యతి13/సప్రాస 20 అక్షరములు ఉండును.

దమయంతి :

సారము గూర్చి పెంచగ గన్నవారు సంకటము నోర్తు రిలన్
భారము దల్వరెప్పుడు పిల్లవాండ్ర వర్ధనము గోరి సదా
చారము నేర్వ జేతురు సత్వరమ్మె సన్మతుల జేయ సదా
గారము తోడుతన్ గనుచున్ దరించి గమ్యమును జేర్తురిటన్

మరో క్రొత్త ఛందము: 10. సరసిజ :

సరసిజ పద్య లక్షణములు : వృత్తం రకానికి చెందినది. అతిధృతి ఛందము నకు చెందిన 182996 వ వృత్తము సరసజతజగ /యతి11/సప్రాస 19 అక్షరములు ఉండును.

సరసిజ :

వరదా! రామచంద్ర! బిరాన భారముల్ తీర్పగ రాగదే!
తరలెన్ సంపదల్ గుదివెట్టె దల్లడమ్ముల్ గడు దుఃఖముల్
వెరపుల్ జుట్టుముట్టె భరింప బీడలన్ శక్తియు గోల్పడెన్
పరువుల్ బెట్టు దీరుగ జేసె బంధువై కావవె! శ్రీహరీ!

11. మల్లెతీగ :

మల్లెతీగ పద్య లక్షణములు : ఉపజాతి రకానికి చెందినది. 13 నుండి 18 అక్షరములు ఉండును. 4 పాదములు ఉండును. ప్రాస నియమం లేదు. ప్రాస యతి నియమం కలదు. ప్రతి పాదము నందు నాల్గవ గణ మొదటి అక్షరము యతి. ప్రతి పాదమున మూడు ఇంద్ర , రెండు సూర్య గణములుండును.

మల్లె తీగ :

సన్నుతులను బూన్చి భక్తిగా శరణు వేడ
దీనుల భారము దీర్చెడు దేవు డతడె
సర్వ జనులు సంతసము నొంద సతము నిలను
శ్రీరాము డవనిని పాలించె సిరులు గురిసె

12. మధురగీతి :

మధురగీతి పద్య లక్షణములు : ఉపజాతి రకానికి చెందినది 12 నుండి 17 అక్షరములు ఉండును. 4 పాదములు ఉండును. ప్రాస నియమం లేదు. ప్రాస యతి నియమం కలదు ప్రతి పాదము న 4వ గణ మొదటి అక్షరము యతి. ప్రతి పాదమున సూర్య, ఇంద్ర, సూర్య, ఇంద్ర, సూర్య గణములుండును.

మధుర గీతి :

నీతి కథలు సతమ్ము జాతికి మేలు
పిల్ల వాండ్రకు నవియె వినిపించి నంత
మంచి పెరుగును భువిని మాన్యత నొంద
విదిత మిద్దియె కనరె! పెద్ద లుడువగ 1

మామి చిగురులు తినగ మత్త కోకిలలు
పాడె కొమ్మపై నుండి పలు విధమ్ములుగ
మధుర గీతిక లచట మధువు లూరింప
చైత్ర మాసమున్ దెల్పె శకము శుభకృతు 2

* * * *

శ్రీరామ లింగేశ్వర (తగణ) దండకము

శ్రీమన్మహాదేవ! శ్రీరామ లింగేశ! నీరూపు నేగాంచి కైమోడ్చి నీదివ్య పంచాక్షరీ మంత్ర నామమ్ము నేఁజేసి మ్రొక్కంగ కైలాసవాసా! హరా శంభులింగా! హరీశా! సురేశా! పరేశా! మహాపాప సంహార! శ్రీపార్వతీనాథ! మాంపాహి! విశ్వేశ! శ్రీశైల మల్లేశ! కాలాగ్నిరుద్రా! మహాదేవ! గౌరీశ! సర్వేశ! మాకున్ సదా నీవె రక్షా! మహాకార! శ్రీకాళ హస్తీశ్వరా! దేవదేవా! జ్వలా! శంకరా! నిన్ను గీర్తించి యర్చింతు దేవేశ! గౌరీశ! ఈశా! మహేశా! గిరీశా! శుభా కార! మాంపాహి! దండింపకయ్యా! శివా! ధీర! కాశీపురాధీశ! లోకార్తి హారీ నమస్తేస్తు! గంగాధరా! తీర్థ దేవా! అమోఘార్ధ నారీశ! ఓంకార నాదాను సంధాన మౌగాన మంత్రాత్మి కంబైన నీదివ్య రూపంబునున్ మజ్జనాదుల్ సమర్పించి మమ్మేలు మంచున్ సదా నిన్ను గొల్వంగ రక్షింప రావయ్య మాంపాహి! మా ఱేడు నీవంచు మారేడు పత్రమ్ములందెచ్చి నీపాద పద్మాల నగ్గింతు నాచంట శ్రీరామ లింగేశ మాంపాహి! నిత్యమ్ము దర్శింప నీ రూపు సేవింప నీపాద రాజమ్ములన్ గల్గు వేగంగ భాగ్యమ్ములున్ పుత్ర పౌత్రాభి వృద్ధిన్ సదా నీదు నామంపు పారాయణే నన్ను రక్షించు మాహాత్మ్య మూలేశ! భీమేశ! సోమేశ! కామేశ! మోక్షేశ! నందీశ! భృంగీశ! నాట్యేశ! సంగీత సాహిత్య కావ్యాను రక్తా! సమర్చింతు పద్యంపు తోరమ్ము లర్పించి మాంపాహి! భక్తాగ్రులన్ గాచి నీదివ్య చైతన్య రూపంబుఁ జూపించి కష్టమ్ముఁ బోకార్చి మోక్షమ్ము నీడేర్చి తీవయ్య! కాకోల గ్రీవా! క్రియాకార! ఖట్వాంగ! సంభగ్న! యుగ్రాక్ష! భూతేశ! బాలాంక! భస్మాంగ! బాలేందు మౌళీ! జటాఝూటధారీ! గుడాకేశ! పంచాస్య! కాలాత్మ! దక్షాధ్వరధ్వంసి!

నృత్యప్రియా! నైకరూపా! త్రినేత్రా! నదీకాంత! పింగాక్ష! భద్రేశ! భద్రమ్ముగా మమ్ము గావంగ రావేల? మాంపాహి! మృత్యుంజయా! నీలకంఠా! లలాటాక్ష! నక్తంచరా! వామదేవా! సురూపా! అఘోరా! కపర్దీ! కపాలాక్ష మాలాధరా! పాశ హస్తాయ నిత్యాయ! మాంరక్ష! రక్షింపరావయ్య! శ్రీరామ లింగేశ్వరా! దివ్య మార్తాండ భాసంబులన్ గూడి చంద్రార్థ చూడామణీ! దివ్యలింగేశ! మాయావిలాసా! పురారాతి! కాలాంతకా! కృత్తివాసా! కపాలీ! భవా! దక్షిణామూర్తి! వేదాంత విజ్ఞానమున్ గూర్చి దుర్మార్గమున్ ద్రుంచి సన్మార్గమున్ వర్ధిలన్ జేసి హే! మంగళాకార! ప్రార్థించుచుంటిన్ దయాసాగరా! నీదు దృక్కుల్ ప్రసర్పింపఁ జేయంగ రక్షించు మో విశ్వనాథా! పినాకీ! హరా! అన్నపూర్ణేశ! మాంపాహి! మాంపాహి! మాంపాహి లోకేశ్వరా! ధింధిమ్మి నాదమ్ము ఆకాశ మంటంగ నీ పాద ఘాతమ్ము కంపమ్ము బుట్టించ దుర్మార్గులప్పట్టు ద్రాసంబు పొందంగ భీతిల్లె బోకారె ముల్లోకముల్ శాంతితో వర్ధిలెన్ పాహిమాం రక్ష రామేశ! భీమేశ! కామేశ! కైలాస వాసా! సురేశా! పరేశా! సదా నిన్ను కీర్తించి మ్రొక్కంగ మమ్మేలు ఓంకార హ్రీంకార మాంపాహి...మాంపాహి....మాంపాహి.....శ్రీరామ లింగేశ్వరా.......

✶✶ సమాప్తము ✶✶

ఓం

శ్రీమదాచంటేశ్వరోదాహరణ కావ్యము



మంత్రవాది వీరవెంకట సత్యనారాయణ